ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

ఆదివారం 21 ఏప్రిల్ 2024



ఏటూరునాగారం రామన్నగూడెం కరకట్టకు బుంగ పడ్డ ప్రదేశంలో నిర్మించిన రాతికట్ట



ఓరుగల్లుపై బీజేపీ గురి

- మోదీ చరిష్మా...అరూరి ఇమేజ్‌పై కమలదళంలో ఆశలు
- 40ఏళ్లకు గెలుపుపై ధీమాతో కార్యక్షేత్రంలోకి శ్రేణులు
- ఇంటింటి ప్రచారం, కార్నర్ మీటింగులపై ఫోకస్
- అటు చేరికలు.. ఇటు పోల్‌మెనేజ్‌మెంట్‌పై నజర్

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి- వరంగల్)

వరంగల్ సీటుపై బీజేపీ గురిపెట్టింది. 40ఏళ్ల తర్వాత వరంగల్‌లో ఆ పార్టీకి అనుకూల పవనాలు వీస్తున్నట్లు కమలనాథులు అంచనా వేస్తున్నారు. 1984లో చందుపట్ల జంగారెడ్డి బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించగా.. నాటిన ఉంచి మళ్లీ బీజేపీకి ఓరుగల్లు ఓటర్లు అవకాశం ఇవ్వలేదు. ఈసారి ప్రధాని నరేంద్రమోదీ చరిష్మాకు తోడు బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ ఇమేజ్ తమ పార్టీ గెలుపునకు దోహదం చేస్తుందనే అంచనాల్లో నేతలున్నారు. దీంతో గెలుపు వ్యూహాలకు నేతలు పదను పడుతున్నారు. ఇంటింటి ప్రచారంతో ఓటర్లను వీలైనన్ని ఎక్కువసార్లు కలవటంతో పాటు కార్నర్ మీటింగులు, బూత్‌స్థాయి ప్రచారానికి ప్రాధాన్యమిచ్చేలా బీజేపీ అధిష్ఠానం ప్రణాళిక రూపొందిస్తోంది. వలసలను ప్రోత్సాహిస్తూనే.. పోల్‌మేనేజ్‌మెంట్‌పై బీజేపీ ఫోకస్ చేస్తోంది.


బీజేపీలో 40ఏళ్లకు గెలుపుపై ఆశలు...

ఎప్పుడో 40 ఏళ్ల క్రితం గెలిచిన వరంగల్ స్థానంపై బీజేపీలో మళ్లీ ఆశలు చిగురించాయి. 1984లో వరంగల్ (హనుమకొండ) స్థానంలో టీడీపీ మద్దతుతో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన చందుపట్ల జంగారెడ్డికి 2,63,762 ఓట్లు (51శాతం) పోలవ్వగా, అప్పటి కేంద్ర మంత్రిగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి పీవీ.నర్సింహరావుకు 2,09,564 ఓట్లు (40.50శాతం) మాత్రమే పోలయ్యాయి. దీంతో పీవీ. నర్సింహరావుపై చందుపట్ల జంగారెడ్డి 54,198ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నాడు దేశంలో బీజేపీ గెలిచిన రెండు ఎంపీ సీట్లలో వరంగల్ ఒకటి. ఆ తరువాత జరిగిన ఏ ఎంపీ ఎన్నికల్లోనూ బీజేపీ విజయం సాధించలేదు. చలాసార్లు బీజేపీకి డిపాజిట్ కూడా దక్కలేదు. 2014 ఎంపీ ఎన్నికల్లో రాగమళ్ల పరమేశ్వర్‌కు 1,87,139ఓట్లు (15.93శాతం), 2015లో జరిగిన ఉపఎన్నికల్లో పగిడిపాటి దేవయ్యకు 1,29,868 (12.57శాతం) ఓట్లు

» మిగతా 8వ పేజీలో...

- కరకట్ట నిర్మాణంలో ప్రభుత్వ నిర్లక్ష్యం
- రెండేళ్ల క్రితం పూర్తయిన టెండర్లు
- 27.891 కిలోమీటర్లకు రూ.114.17 కోట్లు అగ్రిమెంటు
- పనుల నిర్వహణలో జాప్యం
- పలుచోట్ల బలహీనంగా కరకట్ట
- ఏటూరునాగారం, మంగపేట మండలాలకు పొంచి ఉన్న ముప్పు
- ఏటేటా కోతకు గురవుతున్న తీర భూములు
- అమలుకాని గత సర్కారు పునరావాస హామీ

గోదావరి ముంపునకు గురైన ఏటూరునాగారం (ఫైల్)



భయం భయం..

బిక్కుబిక్కుమంటున్న గోదావరి తీర ప్రాంత ప్రజలు

ములుగు, ఏప్రిల్ 20: ఏటా గోదావరి వరద ముంపునకు గురవుతున్న ములుగు జిల్లా ఏటూరునాగారం, మంగపేట మండలాల్లోని తీర గ్రామాలకు రక్షణగోడ నిర్మించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పాలకుల పట్టింపులేని తనానికి.. కాంట్రాక్టు కంపెనీ నిర్లక్ష్యం తోడవ్వడంతో ఈసారి కూడా ముంపు ప్రమాదం పొంచి ఉంది. నిధుల కేటాయింపు, భూసేకరణ లాంటి పలు అవరోధాలను అధిగమించినా పనులు మొదలవకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రామన్నగూడెం, రాంనగర్, పొదుమూరు, అకినేపల్లి మల్లారం, కత్తిగూడెం, చుంచుపల్లి వద్ద తీరం కోతకు గురవుతోంది. ప్రతీ వర్షాకాలంలో ఉగ్రరూపందాల్చే గోదావరి ఏటా వందల ఎకరాల భూములను తనలో కలుపుకుంటోంది. దీంతో తీర గ్రామాల ప్రజలు భయంతో వణుకుతున్నారు. 37ఏళ్లక్రితం వచ్చిన వరదలకు ఈరెండు మండలాల ప్రజలు నిరాశ్రయులయ్యారు. హైదరాబాద్ రాష్ట్రంగా ఉన్న సమయంలో 1948 సెప్టెంబరులో వరదలకు ఏటూరునాగారం ప్రాంతం ముంపునకు గురైంది. తర్వాత 1986 ఆగస్టులో, 1991, 2020, 2022 సంవత్సరాల్లో తీర గ్రామాలు మునిగిపోయాయి. రెండేళ్లక్రితం గోదావరికి వచ్చిన వరదలు చరిత్రలో నిలిచిపోయాయి. అత్యధికంగా 29లక్షల క్యూసెక్కుల వరద ప్రవహించడంతో ముంపు గ్రామాలు తుడిచిపెట్టుకుపోతాయేమోననే ఆందోళన చెందారు. కానీ, రెండురోజుల తర్వాత వరద తగుముఖం పట్టడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు పది రోజులు వేలాది మంది ప్రజలు పునరావాస కేంద్రాలలో తలదాచుకున్నారు. మంగపేట మండలకేంద్రంలోని పొదుమూరు కాలనీకి సమీపంలోని పుష్కరఘాట్ వద్ద గోదావరి ఒడ్డు భారీగా కోతకు గురవుతోంది. 2015లో జరిగి న పుష్కరాల సందర్భంగా ఇక్కడ నిర్మించిన స్నానఘట్టాలు, ఇతర నిర్మాణాలు నదిలో కలిసిపోయాయి. సుమారు 800మీటర్ల వరకు నది గ్రామంవైపుకు చొచ్చుకు వచ్చింది. తీరంవెంట రైతులు సాగుచేసుకుంటున్న పంటభూములు నదిలో కలిసిపోయాయి. 2022లో వచ్చిన వరదలకు రామన్నగూడెం వద్ద బుంగ పడింది. అయితే కొద్ది గంటల వ్యవధిలో వరద తగ్గుముఖం పట్టడంతో ఈ గ్రామం ఉనికి ఇంకా మిగిలి ఉంది.

రక్షణ గోడతో ఊరట

2007లో అప్పటి రాష్ట్రప్రభుత్వం రాంనగర్-మంగపేట మధ్య రూ.46.44కోట్ల వ్యయంతో రివిట్‌మెంట్, లాంచింగ్ ఆప్రాన్‌లతో కరకట్టను నిర్మించింది. ఎస్ఈడబ్ల్యూ కన్‌స్ట్రక్షన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 68శాతం పనులు జరిగాయి. భూసేకరణ సమస్య ఎదురవ్వడంతో 2009 సెప్టెంబర్‌లో సదరు కంపెనీ కరకట్ట పనులను నిలిపివేసింది. మొత్తం 186 ఎకరాలకు (48ఎకరాల పట్టాభూమి, 138ఎకరాలు అసైన్డ్ భూమి) గాను పట్టా భూమికే నష్టపరిహారం చెల్లించారు. మిగిలిన పనులకోసం 2017లో సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ సీఈ, క్యూసీ సీఈల బృందం క్షేత్రపరిశీలన జరిపి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అప్పగించింది. అయితే పాత కాంట్రాక్టు కంపెనీతో చేసుకున్న అగ్రిమెంట్‌ను రద్దుచేసే విషయంలో దాటవేత ధోరణిని కొనసాగించింది. ఐదేళ్ల నిరీక్షణ తర్వాత 2022లో రూ.137.23కోట్లు మంజూరుచేస్తూ పరిపాలనా అనుమతులు జారీ అయ్యాయి. టెండర్లు నిర్వహించగా హర్ష కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హెచ్ఈఎస్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు ఉమ్మడిగా 3.99శాతం అధికానికి టెండర్లు దక్కించుకున్నాయి. మొత్తం రూ.114.17కోట్లకు అగ్రిమెంటు పూర్తయ్యింది. మంగపేట, ఏటూరునాగారం మండలాల్లో కలిపి 27.891కిలోమీటర్ల పొడవునా కరకట్టను నిర్మించాల్సి ఉంది. రామన్నగూడెం వద్ద 10.916కిలోమీటర్లు, రాంనగర్ వద్ద 6.05కిలోమీటర్లు,

» మిగతా 8వ పేజీలో..



మంగపేట పుష్కరఘాట్ వద్ద గోదావరి ప్రవాహ ధాటికి కోతకు గురైన ఒడ్డు (ఫైల్)



ఏటూరునాగారం రామన్నగూడెం వద్ద కోతకు గురవుతున్న గోదావరి ఒడ్డు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

మూడు నెలల్లోనే

కాంగ్రెస్‌పై వ్యతిరేకత

- ఇక బీఆర్ఎస్ కార్యకర్తలు యాక్టివ్ కావాలి
- ఆగస్టులో రుణమాఫీ చేయకుంటే రేవంత్ రాజీనామా చేస్తాడా..?
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్
- భూపాలపల్లిలో వరంగల్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం
- హాజరైన ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్, మధుసూదనాచారి, సారయ్య, రాజయ్య



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్

కృషకాలనీ (భూపాలపల్లి), ఏప్రిల్ 20: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే పెనుమార్పు జరిగిందని, సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు యాక్టివ్ కావాలని, తద్వారా పార్లమెంటు ఎన్నికల్లో గెలుపు సునాయసనమవుతుందని అన్నారు. భూపాలపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. దయాకర్‌తోపాటు పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్, ఎమ్మెల్సీలు సిరికొండ మధుసూదనాచారి, బస్వరాజ్ సారయ్య, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అమలు చేశామన్నారు. హామీలు ఇవ్వకున్నా అనేక పథకాలను కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, బీసీబంధు ఇలాంటి పథకాలేవీ మేనిఫెస్టోలో పెట్టకుండానే అమలు చేశామని తెలిపారు. ఇవన్నీ కాదని ఒక్క రైతు రుణమాఫీ ఏకకాలంలో చేస్తే బీఆర్ఎస్ మూడోసారి గెలిచేదన్నారు.

రేవంత్‌రెడ్డి గురించి తనకు బాగా తెలుసని, బ్రోకర్ మాటలతో అతడు ప్రజలను మభ్యపెడతాడని విమర్శించారు. రైతు రుణమాఫీని పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా ఆగస్టులో చేస్తానని సీఎం చెబుతున్నారన్నారు. ఆగస్టులో రుణమాఫీ చేయకుంటే రాజీనామా చేస్తానని ప్రజలకు సీఎం రాసివ్వాలని డిమాండ్ చేశారు. దందాలు, కబ్జాలు చేసేవాళ్లకు అధికారమే ముఖ్యమని, అలాంటి వారే బీఆర్ఎస్‌ను వీడుతున్నారని వ్యాఖ్యానించారు. వరంగల్ పార్లమెంటు ఎన్నికల్లో వరంగల్ సీటును బీఆర్ఎస్ గెలుచుకోవడం ఖాయమని, కాంగ్రెస్ చేపట్టిన సర్వే అధికారే తనకు ఫోన్ చేసి ఈ విషయం చెప్పారని తెలిపారు.

బీఆర్ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో నిలబడ్డ కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు రెండు ఒక పుట్టలోంచి వచ్చిన వ్యక్తులేనన్నారు. ద్రోహి నెంబర్ 1 కడియం అయితే, ద్రోహి నంబర్ 2 అరూరి రమేష్ అని ఆరోపించారు. కాంగ్రెస్‌లోనే మూడు పార్టీలు ఉంటాయని, ఇక మోదీ దేశానికి ప్రధానో.. గుజరాత్‌కు ప్రధానో అర్థం కాకుండా ఉందని వ్యాఖ్యానించారు. తనను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధిపై పార్లమెంట్‌లో గళాన్ని వినిపిస్తానని అన్నారు. మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి తల కిందకు.. కాళ్లు పైకి పెట్టినా ఆయన ఇచ్చిన హామీలు నెరవేర్చడం సాధ్యం కాదన్నారు. తెల్లారితే ఫోన్ ట్యాపింగ్‌లు, మేడిగడ్డ బ్యారేజీ, అవినీతి అక్రమాలు అంటూ మాట్లాడటం తప్ప రాష్ట్రాభివృద్ధి ఆలోచన లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ తాను వరికోలుపల్లిలో 1,200 ఎకరాలు కబ్జా చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే గ్లోబెల్ ప్రచారం చేశారని, ప్రస్తుతం అధికారం లోకి ఉన్న ఆయనకు అలాంటి ఒక్క గుంట భూమైనా కనిపిస్తుందా..? అని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌కు జైకొట్టిన సారయ్య!

పార్లమెంట్ ఎన్నికల సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడిన ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్ బస్వరాజు సారయ్య చివరకు బీఆర్ఎస్‌కు అనుకూలంగా నినాదాలు ఇచ్చే క్రమంలో పొరబాటున 'జై కాంగ్రెస్' అని నోరుజారారు. దీం తో అక్కడున్న వారందరూ నవ్వును ఆపుకోలేకపోయారు. బీఆర్ఎస్ శ్రేణులు కేరింతలు కొట్టడంతో వెంటనే ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి మైకు తీసుకొని 'జై తెలంగాణ.. జైజై తెలంగాణ' అంటూ నినాదాలు ఇచ్చారు. తన ప్రసంగంలో సారయ్య మాట్లాడుతూ అన్ని కులాల వారికి సముచిత స్థానం కల్పించిన వ్యక్తి మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. రేవంత్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. అన్నం పెట్టిన వ్యక్తికి సున్నం పెట్టిన వ్యక్తి కడియం శ్రీహరి అని మండిపడ్డారు. నిజమైన దళిత బిడ్డ సుధీర్‌కుమార్‌ను ప్రజలు ఆదరించాలని కోరారు.

కడియం పద్మశాలి.. కావ్య ముస్లిం : రాజయ్య

కడియం శ్రీహరి అసలు దళితుడే కాదని, ఆయన పద్మశాలి కులస్థుడని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆరోపించారు. ఆయనో నకిలీ దళితుడని అన్నారు. ఆయన దళితుడే అయితే.. తన తండ్రి, తాత, ముత్తాత ఎవరో చెప్పాలని ప్రశ్నించారు. శ్రీహరి దళితుడే కాన్నప్పుడు ఆయన బిడ్డ దళితురాలు ఎలా అవుతుందని వ్యాఖ్యానించారు. ముస్లిం వ్యక్తిని ఆమె ప్రేమ వివాహం చేసుకుందని, కుల ప్రాతిపాదికన జరుగుతున్న ఈ ఎన్నికల్లో ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. తన డిప్యూటీ సీఎం పదవి గుంజుకొని, ఎమ్మెల్యే కాకుండా అడ్డుకొని, పార్టీలో ఉండకుండా చేసిన శ్రీహరి తనను రాజకీయంగా చాలా దెబ్బతీశారని మండిపడ్డారు. తిన్నింటి వాసాలు లెక్కబెట్టిన ఆయనకు బీఆర్ఎస్‌తో ఉన్న పేగుబంధం తెగిపోయిందన్నారు. ఆరు నెలల్లో కాంగ్రెస్ పార్టీ కూలిపోతుందని చెప్పిన కడియం, మళ్లీ రేవంత్ చెంతన చేరారని ధ్వజమెత్తారు. కేసీఆర్‌నే బోల్తా కొట్టించిన వ్యక్తి అంటే అంతకు మించి ఏముంటుందో అర్థం చేసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ, మునిసిపల్ చైర్ పర్సన్ సెగ్గం వెంకటరాణి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రమేష్ మృతదేహం

టేకుమట్ల, ఏప్రిల్ 20: అప్పుల బాధతో ఉరి వేసుకొని రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. భూర్నపల్లికి చెందిన కొండా రమేష్ (44) తనకున్న రెండెకరాల భూమిలో వరి పంట వేశాడు. సాగునీరు అందకపోవడంతో పంట నష్టం జరిగింది. దీంతో పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు రూ. 1.5 లక్షలు తీర్చలేక మనస్తాపం చెందాడు. తన సోదరి ఇంటికి వెళ్లొస్తానని శుక్రవారం సాయంత్రం ఇంట్లోంచి వెళ్లిన అతడు తిరిగి రాలేదు. ఈ క్రమంలో భూర్నపల్లి గ్రామశివారులోని గుట్ట వైపు శనివారం వెళ్లిన గ్రామస్థులకు రమేష్ మృతదేహం వేపచెట్టుకు వేలాడుతూ కనిపించింది. మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

భూపాలపల్లికి రైల్వేలైన్ తెస్తా..

- ఈ ప్రాంత అభివృద్ధి నా బాధ్యత
- నాపాక ఆలయాన్ని పర్యాటకంగా తీర్చిదిద్దుతా
- బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

చిట్యాల, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే భూపాలపల్లి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ హామీ ఇచ్చారు. భూపాలపల్లికి రైల్వే లైన్ తెచ్చి తీరుతానని అన్నారు. మండలంలోని చల్లగరిగ, జూకల్లు, తిర్మలపురం గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. చిట్యాల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. పదేళ్ల కాలంలో బీజేపీ అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందిందన్నారు. గ్రామ స్థాయి వరకు కేంద్ర ప్రభుత్వ పథకాలు చేరుతున్నా యంటే ప్రధాని నరేంద్రమోదీ చొరవ వల్లే అని కొనియాడారు. కరోనా మహమ్మారితో ప్రపంచ దేశాలు అతలాకుతలం అవుతుంటే దేశంలోని ప్రతి ఒక్కరికీ ఉచితంగా టీకాలు అందించిన మహానేత మోదీ అన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే భూపాలపల్లి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మండలంలోని నాపాక ఆలయాన్ని టూరిజం ప్రాంతంగా తీర్చిదిద్దుతానన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి, పార్టీ హనుకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, రాష్ట్ర నాయకుడు నాగపూరి రాజమౌళి మాట్లాడుతూ పార్లమెంట్



చిట్యాలలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి అరూరి

» మిగతా 8వ పేజీలో..

డీజే నిర్వాహకుడిపై కేసు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 20: పెళ్లి ఊరేగింపులో అర్ధరాత్రి డీజే సౌండ్స్‌తో ప్రజలను ఇబ్బందిపెడుతున్న డీజే నిర్వాహకుడితోపాటు పెళ్లివారిపై కేసు నమోదు చేసినట్లు హనుమకొండ పోలీసులు తెలిపారు. హనుమకొండ పోచమ్మకుంట ఫైన్ ఫంక్షన్ హాల్ సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి డీజేతో ఇబ్బందిపడుతున్నామని స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయగా పోలీసులు డీజే ప్రాంతానికి చేరుకొని నిర్వాహకుడు తాటికొండ సాయి, పెళ్లి వారి నుంచి ముత్తోజ్ అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కాజీపేట జంక్షన్ మీదుగా సమ్మర్ స్పెషల్ రైళ్లు

కాజీపేట, ఏప్రిల్ 20 : రైళ్లలో వేసవి రద్దీ దృష్ట్యా పలు సమ్మర్ స్పెషల్ రైళ్లను నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైళ్ల వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ - దానాపూర్ రైలు ఏప్రిల్ 28, మే 2, 9, 16, 23, 30, జూన్ 6, 13, 20, 27 తేదీల్లో నడుస్తుంది. ఈ రైలు కాజీపేటలో నిర్ణయించిన తేదీల్లో ఉదయం 10 గంటలకు హాల్టింగ్ ఉంటుంది. దానాపూర్ - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 21, 28, మే 5, 12, 19,28, జూన్ 2, 9, 16, 23, 30 తేదీలలో నడుపనున్నారు. ఈ రైలు నిర్ణయించిన తేదీల్లో కాజీపేటకు మధ్యాహ్నం 1 గంటలకు హాల్టింగ్ సౌకర్యం ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు. ఇవే కాకుండా హైదరాబాద్ - రక్సెల్, హైదరాబాద్ - గోరఖ్ మధ్య సైతం సమ్మర్ స్పెషల్ రైళ్లను నడుపనున్నామని, వాటి షెడ్యూల్ త్వరలో విడుదల చేస్తామని రైల్వే అధికారులు తెలిపారు.

24 నుంచి రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

- ఉమ్మడి పది జిల్లాల నుంచి పాల్గొననున్న 50 జట్లు
- తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24నుంచి 27వరకు హనుమకొండ జేఎన్ఎస్‌లోని హ్యాండ్‌బాల్ కోర్టులో 6వ తెలంగాణ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్ తెలిపారు. శనివారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని హ్యాండ్‌బాల్ కార్యాలయంలో క్రీడా పోటీలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పవన్‌కుమార్ పాల్గొని ముందుగా క్రీడా పోటీల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉమ్మడి పది జిల్లాల నుంచి హ్యాండ్‌బాల్‌లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికితీసి వారిని ప్రోత్సహించడానికి తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియే షన్ ఆధ్వర్యంలో 4రోజుల పాటు లీగ్ కమ్, నాకౌట్ పద్ధతిన పండుగ వాతావ రణంలో క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. అండర్-15బాలుర విభాగంలో నిర్వహించే ఈ పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 50 జట్లు పాల్గొంటాయని, ఇందులో పాల్గొనే క్రీడాకారులకు క్రీడా మైదానం సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో బసతో పాటు ఉచిత భోజన వసతులను కల్పిస్తామన్నారు. రాష్ట్ర స్థాయి టాలెంట్ హంట్ చాంపియన్‌షిప్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబ ర్చిన 100 మంది క్రీడాకారులను ఎంపిక చేసి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలం గాణ (సాట్) సహకారంతో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యం లో హైదరాబాద్‌లో నెల పాటు ప్రత్యేక శిక్షణ అందిచడానికి కృషి చేస్తామ న్నారు. అత్యుత్తమ ప్రతిభతో రాణించిన క్రీడాకారులకు సాట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ హాస్టల్లో ప్రవేశాలు కల్పించడంతోపాటు ఖేలో ఇండి యా హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొనేలా అవకాశాలను కల్పించాలన్నారు. విజేతలుగా నిలిచిన జట్టుకు ట్రోఫీ, సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు నగరబోయిన సాంబశివరావు, సంయుక్త కార్యదర్శి ఇట్యాల శ్రీనివాస్, విజయ్ పాల్గొన్నారు.

కావ్య గెలుపునకు సమష్టిగా కృషి చేద్దాం

- వరంగల్ లోక్‌సభ ఎన్నికపై మంత్రి శ్రీధర్‌బాబు దిశా, నిర్దేశం

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 20 : వరంగల్ లోక్‌సభ స్థానాన్ని మూడు లక్షల ఓట్ల మెజారిటీతో కైవసం చేసుకోవాలని ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలకు మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. శనివారం రాత్రి హనుమకొండలోని ఓ హోటల్‌లో శ్రీధర్‌బాబు సమీక్ష జరిపారు. వరంగల్ లోక్‌సభ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డితో పాటు అభ్యర్థి కడియం కావ్య ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, గండ్ర సత్యనారాయణ, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, టీపీసీసీ నాయకులు కూచన రవళి, ఈవీ శ్రీనివాస్, డాక్టరు అనిల్‌కుమార్, డాక్టరు రామక్రిష్ణ తదితరులతో సమీక్ష జరిగింది.

లోక్‌సభ ఎన్నికలో మెజారిటీ, గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గం వరకు ఎమ్మెల్యేలు, ఇతర నాయకుల బాధ్యతల నిర్వహణ, మెజారిటీ, ప్రచారం, పార్టీ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్, 24న సీఎం రేవంత్‌రెడ్డి సభ, తదితర అంశాలను సుదీర్ఘంగా సమీక్షించారు. నిర్వహించాల్సిన అంశాలపై దిశా, నిర్దేశం చేశారు. పార్టీ గెలుపు ఖాయమని, అయితే మెజారిటీ అత్యంత ప్రాధాన్యత విషయమనేది గుర్తించాలని ఉద్బోధించారు. టికెట్ ఆశించి భంగపడ్డ నాయకులతో చర్చించి నచ్చచెప్పాలని సూచించారు. 24 తరువాత ప్రచారాన్ని ఉధృతం చేయాలని, ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు బాధ్యతలు తీసుకోవాలన్నారు. పార్టీ మేనిఫెస్టోను ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. ఈనెల 24న మడికొండలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే బహిరంగ సభ నిర్వహణ, ఏర్పాట్లు తదితర అంశాలను మంత్రి శ్రీధర్‌బాబు సమీక్షించారు. నియోజకవర్గాల వారిగా శ్రేణులతరలింపు, రవాణా ఇతర విషయాలను చర్చించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పాల్గొన్న ఎమ్మెల్యేలు తదితర ముఖ్య నేతలు

వ్యయ పరిశీలన రిజిస్టర్ నిర్వహించాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు ధీరజ్‌సింఘా
- ఎన్నికల పరిశీలకులతో కమిషనర్ భేటీ



కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 20: వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తప్పకుండా ఎన్నికల వ్యయపరిశీలన రిజిస్టర్లు తప్పకుండా నిర్వహించుకోవాలని ఎన్నికల పరిశీలకుడు ధీరజ్‌సింఘా సూచించారు. గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కార్యాలయంలో 15- వరంగల్ ఎస్సీ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని వరంగల్ తూర్పు అసెంబ్లీ సెగ్మెంట్ ఏఆర్‌వో, నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఎన్నికల అధికారులతో శనివారం భేటీ అయ్యారు. ధీరజ్‌సింగా కార్యాలయంలోని పలు ఫైళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా దీరజ్‌సింగా మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న షాడో అబ్జర్వేషన్ రిజిస్టర్లతో పాటు ఎన్నికలకు సంబంధించిన ఖర్చులను రికార్డులను నమోదు చేయాలని సూచించారు. అభ్యర్థుల అమోద, అమోదయోగ్యం కానీ ప్రతీ ఖర్చును లెక్కించాలన్నారు. అభ్యర్థుల ప్రచారం, ర్యాలీలు, సభలు, సమావేశాలకు సంబంధించిన అన్ని క్లిప్స్ సర్వేలెన్స్ టీములు రికార్డు చేయాలన్నారు. అభ్యర్థుల పూర్తి వివరాలు ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు అందించాలని చెప్పారు. ప్రచార ఖర్చులు నిర్ణయించిన ధరల ప్రకారం నమోదు చేయాలని అన్నారు. పోటీచేసే అభ్యర్థులు అన్ని రకాల కర్చులు తప్పకుండా పక్కా లెక్క ఉండాలన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యయపరిశీలకులు మానస, అకౌంటింగ్ టీం సిబ్బంది ఖీరానాయక్, లింగస్వామిలతో పాటు పలు శాఖల సిబ్బంది ఉన్నారు.

ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలి

- వరంగల్ తూర్పు స్వీప్ నోడల్ అధికారి రాజేశ్‌కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి రాజేశ్‌కుమార్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 20 : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని వరంగల్ తూర్పు స్వీప్ నోడల్ అధికారి రాజేశ్ కుమార్ అన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా శనివారం బల్దియా కార్యాలయం ఆవరణలోని మెప్మా కార్యాలయంలో ఓటు హక్కుపై లోక్‌సభ నియోజక వర్గం పరిధి -106 (వరంగల్ తూర్పు) స్వీప్ -2024 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏకశిల పట్టణ సమాఖ్య సభ్యులకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాజేశ్ కుమార్ హాజరై మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు అవగాహనపై ప్రజల్లో విస్తృత అవగాహన తీసుకురావాలని అన్నారు. అదే విదంగా ఈ నెల 25న ఉదయం 8 గంటలకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ రమేష్, సీవోలు నాగరాజు, సఫియా, ఆర్‌పీలు పాల్గొన్నారు.

వరంగల్‌లో మూడో రోజు నాలుగు నామినేషన్లు



వరంగల్ పార్లమెంట్ ఆర్‌వో ప్రావీణ్యకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎంసీపీఐ(యూ) అభ్యర్థి సావిత్రి



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న స్వతంత్ర అభ్యర్థి గాదెపాక అనిల్‌కుమార్



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి మేకల సుమన్

వరంగల్ కలెక్టరేట్/మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతోంది. మూడో రోజైన శనివారం వరంగల్ పార్లమెంట్ స్థానానికి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్ కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ఎంసీపీఐ(యూ) అభ్యర్థి మాస్ సావిత్రి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థి గాదెపాక అనిల్‌కుమార్ ఒకసెట్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి మేకల సుమన్ ఒకసెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మరో స్వతంత్ర అభ్యర్థి బరిగెల శివ తొలిరోజున ఒక సెట్ వేయగా, శనివారం మరోసెట్ పత్రాలను అందజేశారు. ఇకమహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి మూడో రోజు శనివారం

మహబూబాబాద్‌లో నిల్

ఒక్క నామినేషన్ కూడా దాఖలవలేదు. ఈ నెల 18న తొలి రోజు ఒకరు, 19న రెండవ రోజు నలుగురు నామినేషన్లు వేశారు. కాగా, 22వ తేదీ సోమవారం బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్, 23న బీఆర్ఎస్ అభ్యర్థిగా మాలోతు కవిత నామినేషన్లు వేయనున్నారు.

నామినేషన్ కౌంటర్

మూడో రోజు (20-4-2024)	దాఖలైన మొత్తం నామినేషన్లు: వరంగల్	మహ-బాద్
	11	6

వరంగల్ (ఎస్సీ) : మాస్ సావిత్రి (ఎంసీపీఐ), మేకల సుమన్ (ధర్మ సమాజ్ పార్టీ), గాదెపాక అనిల్‌కుమార్ (స్వతంత్ర), బరిగెల శివ (స్వతంత్ర)

మహబూబాబాద్(ఎస్టీ) : లేవు.



సమాచారమంతా చరవాణిలోనే..

- సీ-విజిల్‌తో ఎన్నికల ఉల్లంఘనలకు అడ్డుకట్ట



వరంగల్ సిటీ, ఏప్రిల్ 20 : ప్రస్తుతం డిజిటల్ యుగం నడుస్తోంది. గతంతో పోలిస్తే ఇప్పుడు డిజిటల్ అక్షరాస్యత పెరిగిపోయింది. ప్రతీ ఇంట్లో చరవాణి(మొబైల్), ప్రతీ మనిషికో చరవాణి మామూలైపోయింది. ఈ అంశాన్నే కేంద్ర ఎన్నికల సంఘం పరిగణలోకి తీసుకుంది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పక్కాగా ప్లాన్ చేసింది. ప్రతీ విషయం ఓటరు తెలుసుకునేలా యాప్‌లను రూపొందించింది. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఓటర్లు ఫిర్యాదు చేసేందుకు, ప్రలోభాలు, అక్రమాలను అరికట్టేందుకు, అభ్యర్థుల వివరాలను తెలుసుకునేందుకు ఇలా ప్రతీ సమాచారం అందుబాటులో ఉంచుతోంది. బరిలో నిలిచే అబ్యర్థులు సైతం ఆన్‌లైన్ ద్వారానే సభలు, సమావేశాల నిర్వహణకు అనుమతులు తీసుకునేలా అవకాశం కల్పించింది. భారత ఎన్నికల సంఘం రూపొందించిన యాప్‌లను స్మార్ట్ ఫోన్‌లలో ప్లే స్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

సీ-విజిల్‌తో..



అలాగే కోడ్ ఉల్లంఘన, వ్యయ ఉల్లంఘన జరిగితే వెంటనే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడానికి సీ-విజిల్ యాప్‌ను ఉపయోగించండి. నగదు, మద్యం, మాదక ద్రవ్యాల పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టు వస్తువుల పంపిణీ, ప్రజల ఆస్తులను పాడుచేయడం, కుల, మత ద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు జరిగితే ఫిర్యాదు చేయవచ్చు. అలాగే అసత్య వార్తల ప్రసారం, ఓటర్లను బెదిరించడం, చెల్లింపు వార్తలు, మారణాయుధాలు కలిగియుండుట, ఓటర్ల రవాణా ఇలాంటివన్నీ ఎన్నికల నియమావళి ఉల్లంఘనల కిందకే వస్తాయి. వీటిపై సీ-విజిల్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. మీరు చేసిన ఫిర్యాదుకు వెంటనే ఎన్నికల అధికారులు స్పందిస్తారు. ఐదు నిమిషాల వ్యవధిలో జిల్లా ఎన్నికల అధికారి వెరిఫికేషన్ కోసం ఫీల్డ్ యూనిట్‌కు ఫిర్యాదును కేటాయిస్తారు. 15 నిమిషాలలో ఫీల్డ్ టీమ్, ఫిర్యాదు చేసిన స్థలానికి చేరుకుంటుంది. 30 నిమిషాలలో ఫీల్డ్ టీం చర్య అమలు చేసి నివేదిక పంపిస్తారు. 50 నిమిషాలలో రిటర్నింగ్ అధికారి ఫిర్యాదుపై చర్యలు చేపడుతారు.

అదుపు తప్పి ఫ్లైయాష్ లోడ్ లారీ బోల్తా

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



మడికొండ, ఏప్రిల్ 20 : ఔటర్ రింగ్‌రోడ్డుపై ఫ్లైయాష్ లోడ్ లారీ అదుపు తప్పి బోల్తా పడడంతో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మడికొండ ఏఎస్సై చంద్రమౌళి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున భూపాలపల్లి నుంచి సూర్యాపేటకు ఫ్లైయాష్ లోడ్‌తో వెళ్తున్న లారీ కాజీపేట మండలం టేకులగూడెం క్రాస్ వద్ద ఔటర్ రింగ్ రోడ్ పై అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ గుగులోత్ నితిన్ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. 100 డయల్ సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించి వారి సహాయంతో డ్రైవర్‌ను క్యాబిన్‌లో నుంచి బయటకు తీసి ఎంజీఎంకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా, లారీ డ్రైవర్, ఓనర్‌లు సూర్యాపేటకు చెందిన వారని ఏఎస్సై తెలిపారు.

వీవీ ప్యాట్, ఈవీఎంల తేడా



వరంగల్ కలెక్టరేట్ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్(ఈవీఎం), ఓటర్ వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయల్(వీవీ ప్యాట్). అభ్యర్థి పేరు, గుర్తు, సీరియల్ నెంబరు అన్ని కనిపిస్తాయి. ఇలా 7 సెకన్లు మాత్రమే ఉంటుంది. ఈవీఎంలలో కంట్రోల్ యూనిట్, బ్యాలెటింగ్ యూనిట్‌లు ఉంటాయి. కంట్రోల్ యూనిట్ పోలింగ్ ఆఫీసర్ దగ్గర, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్ ఓటు వేసే ఓటరు దగ్గర ఉంటాయి. పోలింగ్ ఆఫీసర్ యాక్టివేట్ చేస్తేనే ఓటు వేసే అవకాశం ఉంటుంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే శిక్ష



వరంగల్ కలెక్టరేట్ : ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951 ప్రకారం ఎన్నికల నిబంధనలు ఎవరైనా ఉల్లంఘించినట్లయితే రెండు సంవత్సరాల పాటు జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. అభ్యర్థులు బాధ్యతాయుతంగా ఖాతాల వివరాలను ఎన్నికల అధికారులకు తెలియపర్చాలి. ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు, పెయిడ్ న్యూస్, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టులను ఉల్లంఘనగా పరిగణిస్తారు.

వెబ్‌సైట్‌లో సమగ్ర సమాచారం



వరంగల్ కలెక్టరేట్ : ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉండేలా కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించింది.

ceotelangana.nic.in వెబ్‌సైట్‌లో ఓటరు నమోదుతో పాటు ఓటరు జాబితాలో పేరు, తొలగింపు, సవరణలు చేసుకోవచ్చు. అలాగే పోలింగ్ కేంద్రం వివరాలతో పాటు పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా గతంలో పోటీ చేసిన అభ్యర్థుల వివరాలు కూడా వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

కష్టకాలంలో తోడున్న వారే నిజమైన కార్యకర్తలు

- ద్రోహులకు బీఆర్ఎస్ కార్యకర్తలు గుణపాఠం చెప్పాలి
- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్
- పరకాలలో బీఆర్ఎస్ లోక్‌సభ స్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బండా ప్రకాశ్

పరకాల, ఏప్రిల్ 20: కష్టకాలంలో తోడున్న వారే పార్టీకి నిజమైన కార్యకర్తలని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. పట్టణంలోని లలితా కన్వెన్షన్ హాలులో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అధ్యక్షతన శనివారం బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి లోక్‌సభ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. అధికార దాహం కోసం పార్టీ మారే నాయకులు, కార్యకర్తలు పార్టీకి అవసరం లేదని, ఎందరు వెళ్లినా వరంగల్ ఎంపీ స్థానం బీఆర్ఎస్ అధిక మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో అబద్ధాల హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పే రోజు వచ్చిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 15న రైతులకు రుణమాఫీ చేస్తామని ఇప్పటి కూడా కల్లబొల్లి మాటలు చెబుతున్నాడని అన్నారు. బ్రోకర్లే పార్టీలు మారుతున్నారు తప్పా.. నిజమైన కార్యకర్తలు పార్టీలోనే ఉన్నారని తెలిపారు. కడియం శ్రీహరిని తన తండ్రి చదివించాడని, అలాంటి వాడు తనను వ్యతిరేకించి మాట్లాడటం సరైంది కాదన్నారు. ఎన్నో కష్టాలకు ఓర్చి కాళేశ్వరం ప్రాజెక్టు కడితే రైతులు ఎంతో మంది మూడు పంటలు పండిస్తున్నారని, ఒకటి రెండు పిల్లర్లు కుంగితే కాంగ్రెస్ వాళ్లు వేలెత్తి చూపడం సరికాదన్నారు.

బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ పార్టీ అండతో ఎదిగిన కడియం శ్రీహరి, అరూరి రమేశ్ ద్రోహులుగా నిలిచారని, ఎన్నికల్లో వారికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికలు మోసానికి, న్యాయానికి మధ్య జరిగే పోరు అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఎన్నో అబద్దాలు చెబుతూ ఎన్నో పదవులు పొంది, ఎంతో సంపాదించుకున్న కడియం శ్రీహరి మోసకారి అన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే కడియం శ్రీహరి తన ఎమ్మెల్యే పదవిని రాజీనామా చేసి మళ్లీపోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. ప్రతీ ఒక్క కార్యకర్త ప్రజల్లోకి వెళ్లి కడియం శ్రీహరి చేసిన ద్రోహం వివరించాలని పిలుపునిచ్చారు.

కడియం శ్రీహరి నకిలీ దళితుడు

కడియం శ్రీహరి నకిలీ దళితుడు అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. దళితద్రోహి, అవినీతి చక్రవర్తి, చరిత్రహీనుడు, దళిత హక్కులను దోచుకునేవ్యక్తి కడియం శ్రీహరి అని ధ్వజమెత్తారు. తాను మాదిగ కులానికి చెందినవాడినని, కడియం శ్రీహరికి దమ్ముంటే ఆయన కులం ఏమిటో చెప్పాలని నిలదీశారు. బైండ్ల కులంలో చేరి దళిత హక్కులను దోచుకుతింటున్నాడని ఆరోపించారు. కన్నతల్లి లాంటి బీఆర్ఎస్ పార్టీకి, దేవుడు లాంటి కేసీఆర్‌ను మోసం చేసి నకిలీ కులం పేరుతో బిడ్డను రాజకీయాల్లో దింపి గెలిపించుకునే ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని, తానూ పోటీ చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, లింగంపెల్లి కిషన్‌రావు, శోభన్‌బాబు, వాసుదేవరెడ్డి, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ ఉంటేనే దేశానికి భద్రత

- పథకాల పేరుతో కాంగ్రెస్ మోసం
- వరంగల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్



శాయంపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న అరూరి రమేష్

శాయంపేట, ఏప్రిల్ 20 : నరేంద్ర మోదీ ప్రధానిగా ఉంటేనే భారత దేశానికి రక్షణ ఉంటుందని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల కీర్తిరెడ్డితో పాటు మండల కేంద్రంలో అరూరి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. పదేళ్లుగా దేశంలో ఎలాంటి అవినీతి, కుంభకోణాలు లేకుండా బీజేపీ సుపరిపాలన కొనసాగిస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించకపోయినా కేంద్రం పెద్దన్న పాత్ర పోషిస్తూ రాష్ట్రాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని కొనియాడారు. ఆర్టికల్ 370 రద్దులాంటి చారిత్రాత్మకమైన నిర్ణయాలు జరిగాయని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం అక్కడి ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వ కార్యక్రమాలతోపాటు సొంతంగా అనేక సేవా కార్యక్రమాలు చేశామని అన్నారు. వరంగల్ ఎంపీగా గెలిపిస్తే దేశంలోనే వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. మామునూరు ఎయిర్‌పోర్టు పునరుద్ధరణ, భూపాలపల్లి రైల్వేలైన్ నిర్మాణం, టెక్స్‌టైల్ పార్క్ విస్తరణ లాంటి అనేక లక్ష్యాలు పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లో సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ గెలిచిందని అరూరి ఆరోపించారు. ఇప్పటివరకు హామీలు అమలు చేయలేదని అన్నారు. లోక్‌సభ ఎన్నికలలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను చిత్తుగా ఓడించి. మోదీని ప్రధాని చేయడానికి బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు నాగపురి రాజమౌళి, మార్తినేని ధర్మారావు, చందుపట్ల సత్యపాల్‌రెడ్డి, వన్నాల శ్రీనివాసులు జిల్లా నాయకులు రాయరాకుల మొగిలి, నరహరిశెట్టి రామక్రిష్ణ, వనం దేవరాజు, నాగరాజు, కోమటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



బాలరాజు (ఫైల్)

ఐనవోలు, ఏప్రిల్ 20 : కుటుంబంలో కుమారుడు, తల్లి వరుసగా మృతిచెందడంతోపాటు తండ్రి, కూతురు అనారోగ్యానికి గురికావడంతో మనస్తాపానికి గురైన ఓవ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెంకటాపురంలో చోటుచేసుకుంది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. అదే గ్రామానికి చెందిన కొసుకొండ బాలరాజు (32) శుక్రవారం పురుగుల మందు తాగగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. బాలరాజు కుమారుడు సాయి మూడేళ్ల వయస్సులో కిందటేడు అనారోగ్యంతో మృతిచెందగా, తల్లి సోమమ్మ రెండు మాసాల కిందట మృతి చెందింది. కూతురు వైష్ణవి మానసిక వికలాంగురాలు, తండ్రి మల్లయ్య పది రోజుల కిందట పక్షవాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులిద్దరు మృతిచెందడం.. ఇద్దరు అనారోగ్యానికి గురికావడంతో మనోవేదనకు గురైన బాలరాజు.. జీవితంపై విరక్తి చెంది ఐనవోలు శివారులోని జామాయిల్ తోటలో పురుగుల మందు తాగాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య ఉంది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల స్థాయి యూత్ మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పి. రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 26నుంచి 28వరకు హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యూత్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు 1జనవరి 2006 నుంచి 31 డిసెంబరు 2007 మధ్య జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ ఒరిజినల్ ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, మెడికల్ సర్టిఫికెట్‌లను వెంట తీసుకొని ఈ నెల 21న హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్‌హాల్‌లో ఉదయం 7గంటలకు రిపోర్టు చేయాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు సెల్ 9959711609 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఓరుగల్లుపై బీజేపీ కన్ను!

(5వ పేజీ తరువాయి)

పోలయ్యాయి. 2019 ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చింత సాంబమూర్తికి కేవలం 83,777ఓట్లు (7.89శాతం) మాత్రమే పోలయ్యాయి. గత పదేళ్లలో ప్రతీ ఎన్నికల్లో బీజేపీ ఓటు బ్యాంకు దిగజారుతూ వచ్చింది. అయితే ఈసారి అనూహ్యంగా బీజేపీ పుంజుకుంటున్నట్టు ప్రచారం జరుగుతుండటం, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడి పోవటంతో కీలక నేతలు ఆ పార్టీని వీడుతున్నారు. దీంతో మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దీటుగా ఎదిగేందుకు కాషాయ పార్టీ వ్యూహాలు రచించింది. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను బీజేపీలో చేర్చుకుని టికెట్ ఇచ్చింది. పార్టీలో కీలక నేతల మధ్య సమన్వయం చేసి ఎన్నికల బాధ్యతలను అప్పగించింది. 40ఏళ్ల తరువాత పరిస్థితులు తమకు అనుకూలంగా ఉండటంతో ఆ పరిస్థితులను వినియోగించుకోవాలన్న లెక్కల్లో బీజేపీ నేతలున్నారు.

మోదీ మేనియా.. అరూరి ఇమేజ్‌పైనే...

దేశవ్యాప్తంగా నరేంద్రమోదీకి ఉన్న చరిష్మాపై బీజేపీ ఆశలు పెట్టుకుంది. ప్రధానంగా అర్బన్ ఓటర్లు మోదీ విధానాలకు అనుకూలంగా ఉన్నట్టు అంచనా వేసుకుంటున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అర్బన్ ప్రాంతాలున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో 42,783ఓట్లతో బీజేపీ అభ్యర్థి ద్వితీయ స్థానంలో నిలిచారు. అలాగే వరంగల్ పశ్చిమలో 30,826 ఓట్లు, పరకాల అసెంబ్లీ సెగ్మెంట్‌లో 38,593ఓట్లను సాధించింది. అసెంబ్లీ ఎన్నికలకు, ఎంపీ ఎన్నికలకు ఓటరు నాడీ వేరేలా ఉంటుందని, ప్రస్తుతం మోదీ చరిష్మాతో అర్బన్ ప్రాంతాల్లో మెజారిటీ ఓట్లు సాధించవచ్చుననే లెక్కల్లో బీజేపీ శ్రేణులు ఉన్నాయి. అలాగే అరూరి రమేష్ వ్యక్తిగత పరిచయాలు, బలమైన బంధుత్వాలు ఉండటంతో వర్ధన్నపేట, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాల్లో కూడా భారీ స్థాయిలో ఓట్లు పడుతాయనే అంచనాల్లో బీజేపీ నేతలున్నారు. ఇక భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో బలమైన కేడర్ ఉండటం తమకు కలిసి వస్తుందనే ఆశతో కమలం పార్టీ నేతలున్నారు. పాలకుర్తి అసెంబ్లీ సెగ్మెంట్‌లో పార్టీ కొంత బలహీనంగా ఉందనే చర్చజరుగుతోంది. అక్కడ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను తట్టుకుని కనీసం రెండోస్థానంలోకి రావాలనే వ్యూహంతో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ 'ఆపరేషన్ లోటస్'ను ప్రారంభించినట్లుగా సమాచారం. దీంతో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఉన్న కీలక నేతలతో రహస్య మంతనాలు జరిపినట్టు ప్రచారం జరుగుతోంది. దీనికి తోడు బీజేపీ ఉమ్మడి వరంగల్ కీలక నేతలు ఐక్యతతో కలిసి పని చేస్తుండటం.. అధిష్ఠానం దూతలుగా మాజీ ఎంపీలు గరకపాటి మోహన్‌రావు, చాడ సురేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు పర్యవేక్షణలో కమలం పార్టీ స్పీడ్ పెంచిందనే చర్చ కేడర్‌లో వినిపిస్తోంది.

ఓటర్లే లక్ష్యంగా ముున్ముందుకు..

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో విజయం కోసం ఉవ్విళ్లూరుతున్న బీజేపీ ఓటర్లే లక్ష్యంగా ఎత్తులు వేస్తోంది. మే 13న జరిగే ఎన్నికల లోపు ప్రతీ ఓటరును కలిసే వ్యూహరచన చేస్తోంది. ప్రధానంగా బూత్‌స్థాయి కమిటీలపై దృష్టి పెట్టింది. బూత్ కమిటీ సభ్యులు ఎన్నికల నాటికి ప్రతీ ఇంటికి కనీసం మూడుసార్లు వెళ్లి ఓటరును కలిసి బీజేపీ అభ్యర్థికి ఓటడిగేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇప్పటికే ఈ నెల 15, 16, 17 తేదీల్లో తొలివిడతగా బూత్ స్థాయిలో ఇంటింటికి వెళ్లి బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరిన శ్రేణులు.. రెండో విడతగా ఈనెల 28,29,30 తేదీలు, మూడో విడతగా మే 9,10,11 తేదీల్లో ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించేలా వ్యూహరచన చేస్తున్నారు.

బూత్‌స్థాయి ప్రచారంతో పాటు కార్నర్ మీటింగ్‌లకు కూడా ప్రాధాన్యమిస్తున్నారు. మే మొదటి వారంలో సాధ్యమైనంత వరకు ఎక్కువగా బీజేపీ అభ్యర్థి రమేష్‌తో కలిసి కార్నర్ మీటింగ్‌లు నిర్వహించేలా అధిష్ఠానం ప్రణాళిక రూపొందిస్తోంది. పార్లమెంట్ పరిధిలో ఒకటిరెండు భారీ బహిరంగ సభలను నిర్వహించేలా అది కూడా ప్రధాని మోదీ లేదా అమిత్‌షాతో ఒక సభ, బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై లేదంటే జేపీ నడ్డాలలో ఒకరితో మరో మీటింగ్ ఏర్పాటు చేయాలని భావిస్తోంది. గ్రామస్థాయి, వీధి మీటింగులతో పార్టీవాణిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని భావిస్తోంది. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందుతున్న వారి వివరాలు సేకరించి, నిత్యం వారితో టచ్‌లో ఉండేలా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి చేరికలకు ప్రాధాన్యమిస్తున్నారు.

పోల్‌మెనేజ్‌మెంట్‌లో ఎక్కడ కూడా వెనుకడుగు వేయకుండా వ్యూహాత్మకంగా కాషాయ పార్టీ కసరత్తు చేస్తోంది. మొత్తానికి ఓటరే లక్ష్యంగా బీజేపీ ముందుకు సాగుతుండగా.. 40ఏళ్ల తరువాత వరంగల్‌లో కాషాయ జెండా ఎగుతుందనే ఆశలో ఆ పార్టీ శ్రేణులున్నాయి.

మావోయిస్టు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే



సుధాకర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

చిట్యాల, ఏప్రిల్ 20: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేడ్, బస్తర్ అడవుల్లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టు సుధాకర్ కుటుంబాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మండలంలోని చల్లగరిగలో శనివారం పరామర్శించారు. మృతులు సుధాకర్, ఆమె భార్య సుమన చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. సుధాకర్ తల్లి రాజపోచమ్మను ఓదార్చి, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు గాజర్ల అశోక్, పార్టీ రాష్ట్ర నాయకుడు రాంనర్సింహరెడ్డి, నాయకులు రత్నాకర్‌రెడ్డి, సంపత్, తడుక కుమార్, రవీందర్‌రెడ్డి, సుదాకర్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో భారీ చేరికలు

భూపాలపల్లిటౌన్: కాంగ్రెస్‌లో శనివారం భారీ చేరికలు జరిగాయి. భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని కొత్తపల్లి మండలానికి చెందిన పలువురు పార్టీలో చేరారు. కొత్తపల్లి గోరి మండలంలోని సుల్తాన్‌పూర్ మాజీ సర్పంచ్ అంబాల చందుగౌడ్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు గాజర్ల పురుషోత్తం, శ్రీనివాస్, గట్టు రవి, బీఆర్ఎస్ నాయకులు కాసెట్టి వరదరాజు, రామదాసు, కుమారస్వామి, వెంకటేశ్‌తో పాటు సుమారు 50 మంది కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమం భూపాలపల్లిలోని పార్టీ కార్యాలయంలో జరిగింది.

22న జాబ్‌మేళా

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 20: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం భూపాలపల్లిలోని సంఘమిత్ర డిగ్రీ, పీజీ కళాశాల లో ఈనెల 22న జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు కరస్పాండెంట్ గుర్రపు రవీందర్ శనివారం తెలిపారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో జెన్‌ప్యాక్ట్ కంపెనీలో 200 మందికి ఉద్యోగావకాశం ఉందని పేర్కొన్నారు. 2020 నుంచి 2024 వరకు డిగ్రీ, పీజీ చేసి ఉత్తీర్ణులైన అభ్యర్థులతో పాటు ఈ అకాడమీలో ఫైనల్ ఇయర్ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులని తెలిపారు. జాబ్ మేళాకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట రెస్యూమె, స్మార్ట్‌ఫోన్, హెడ్‌సెట్ తీసుకురావాలని సూచించారు. ఎంపికైన వారు వరంగల్, హైదరాబాద్ ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు.

కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు



సంఘటన స్థలంలో కానిస్టేబుల్ శివకుమార్

కృష్ణకాలనీ (భూపాలపల్లి), ఏప్రిల్ 20: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కానిస్టే బుల్‌కు గాయాలైన సంఘటన భూపాలపల్లి మండలం మోరంచపల్లిలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో టీఎస్‌పీఎస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎ.శివకుమార్ బైక్‌పై మోరంచపల్లికి వెళ్లాడు. తిరిగి భూపాలపల్లి వస్తున్న క్రమంలో మోరంచపల్లి గ్రామ శివారులో ప్రధాన రహదారి పక్కన ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. కిందపడిపోయిన ఆయన తలకు, చేతికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 108 సిబ్బంది భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హనుమకొండకు తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిసింది.

బాలసదనాన్ని సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 20: ములుగులోని బాలికల బాలసదనాన్ని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.మాధవి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. బాలసదనంలో అనాథలకు అందుతున్న సౌకర్యాలు, వసతుల గురించి తెలుసుకున్నారు. భోజనం, తదితర సౌకర్యాలను పరిశీలించారు. ఆమె వెంట జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్, బాలసదనం సూపరింటెండెంట్ వి.సుమతి, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ నరేష్, ప్రొటెక్షన్ ఆఫీసర్ కృష్ణవేణి, కౌన్సిలర్ రాణి తదితరులు ఉన్నారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య



శశికళ మృతదేహం

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 20: పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని ఆలుబాక పంచాయతీ పరిధిలోని ముత్తారం గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తారం గ్రామంలోని బొగ్గుల శశికళ(25)కు ఈనెల 4న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కత్తిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. కాగా, శనివారం ఉదయం శశికళను తమ వెంట తీసుకెళ్లేందుకు అత్తింటివారు ముత్తారం గ్రామానికి వచ్చారు. దీంతో శశికళ కాపురానికి వెళ్లనని భీష్మించుకుంది. తల్లిదండ్రులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా వినలేదు. కాపురానికి వెళ్లేందుకు ఇష్టంలేని శశికళ మనస్తాపానికి గురై ఇంట్లో పురుగుల మందు తాగింది గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో బలవన్మరణం



దేవ్‌సింగ్ (ఫైల్)

మేడారం, ఏప్రిల్ 20 : కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తాడ్వాయి మండలం నార్లాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. మద్యానికి బానిసగా మారిన ధారావత్ దేవ్‌సింగ్ (30) భార్య లక్ష్మి, తండ్రి బిచ్చతో నిత్యం గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మద్యం మత్తులో తన ఇంట్లో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు.

మృతుడికి ఇద్దరు ఎనిమిది, ఐదు సంవత్సరాల ఆడపిల్లలు, 6నెలల కొడుకు ఉన్నారు.

జరంత ఉపశమనం

● కమ్ముకున్న మేఘాలు.. చల్లబడ్డ వాతావరణం

ములుగు, ఏప్రిల్ 20: మండు వేసవిలో అల్లాడుతున్న ములుగు జిల్లా జనానికి శనివారం చల్లబడ్డ వాతావరణంతో కొంత ఉపశమనం కలిగింది. శుక్రవారం సాయంత్రం నుంచి ఆకాశం క్రమంగా మేఘావృతం కావడం, శనివారం రోజంతా వాతావరణం చల్లగా ఉండడంతో ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఎండ వేడి, ఉక్కపోతతో తల్లడిల్లిన జనం కొంత ఊరట చెందారు. పొరుగు జిల్లాల్లో స్వల్ప వర్షపాతం నమోదు కాగా ములుగులో చినుకులు పడలేదు. ఈప్రభావం మరోకరోజు కొనసాగుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలుపుతున్నారు.

అన్నదాతల్లో ఆందోళన

ఆకాశమంతా దట్టమైన మేఘాలు కమ్ముకోవడం, వర్ష సూచన ఉండడంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. వరి కల్లాల్లో వడ్లు, మిర్చి ఆరబోసి ఉన్నాయి. మామిడికాయలు కోతదశకు వచ్చాయి. ఈపరిస్థితుల్లో ఈదురుగాలులు, వర్షం కురిస్తే భారీ నష్టం కలుగుతుంది. ఈనేపథ్యంలో రైతుల్లో భయాందోళన నెలకొంది.

ఉక్కిరిబిక్కిరి నుంచి ఊరట

భూపాలపల్లిటౌన్ : కొద్దిరోజులుగా అధిక ఉష్ణోగ్రతతో ఉక్కిరిబిక్కిరి అయిన జనానికి కాస్త ఊరట కలిగింది. 43డిగ్రీలకు తగ్గకుండా ఉన్న ఎండ వేడిమి ఒక్కసారిగా శనివారం తగ్గిపోయింది. వాతావరణం చల్లబడటంతో ఉపశమనం కలిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వాతావరణ మేఘావృతమై ఉంది. దీంతో వర్షం పడుతుందని భావించినప్పటికీ కురవకపోవడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు.

నీటి చౌర్యం చేస్తే కఠిన చర్యలు

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కాటారం, ఏప్రిల్ 20: వేసవిలో నీటి ఎద్దడి లేకుండా సరఫరా సక్ర మంగా జరిగేలా చర్యలు చేపడుతున్నామని అద నపు కలెక్టర్ కర్నాటి వెంక టేశ్వర్లు అన్నారు. ప్రజల కు సరిపడా నీటిని సరఫరా చేస్తున్నా మని, వాల్వ్ లు తొలగించడం, మోటా ర్లతో నీటిని తోడటం లాంటి పనులతో నీటి చౌర్యానికి పాల్పడే వారిపై కేసులు తప్పవని హెచ్చరించారు. కాటారం జీపీ పరిధిలో డీపీవో నారాయణరావు, స్థానిక అధికారులతో కలిసి అడిషనల్ కలెక్టర్ శనివారం పర్యటించారు. ఏడు ఓవర్ హెడ్‌ట్యాంకులు, పైప్‌లైన్ల ద్వారా నీటి సరఫరా జరుగుతున్న తీరును పరిశీలించారు. పలు వాడలకు చెందిన ప్రజలను నీటి సరఫరా సక్రమంగా జరుగుతుందా..? అని అడిగి తెలుసుకున్నారు. కొందరు తమ ఇళ్లకు సరిగా నీరు అందడం లేదని, పలువురు మోటార్లు పెట్టడంతో సక్రమంగా రావడం లేదని అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి కుటుంబానికీ 400 లీటర్ల నీరు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్‌భగీరథ అధికారులు, జీపీ కార్యదర్శులతో మండలంలో సమ్మర్ వాటర్ ప్లానింగ్‌పై సమీక్షించారు. కలెక్టర్ నిధులను మంజూరు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి నారాయణరావు, డీఎల్‌పీవో వీరభద్రయ్య, ఎంపీడీవో అడ్డూరి బాబు, ఎంపీవో ఉపేంద్రయ్య, ఏఈ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీల పట్టివేత

వాజేడు, ఏప్రిల్ 20: అధిక లోడుతో ఇసుకను తరలిస్తున్న మూడు లారీ లను వాజేడు పోలీ సులు మండలంలోని చీకుపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ఈ మేరకు ఎస్సై వెంకటే శ్వర్‌రావు తెలిపారు. చీకు పల్లిలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా చెరుకూరు నుంచి వాజేడు వైపు మూడు లారీలు అధిక ఇసుక లోడుతో వస్తుండటంతో వాటిని తనిఖీ చేశామన్నారు. డీడీ ప్రకారం కాకుండా 3-5 టన్నుల అదనంగా ఇసుక ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈలారీలు అయ్యవారిపేట ఇసుక ర్యాంపునకు చెందినవని, డ్రైవర్లు ఉరుకొప్పుల దస్తగిరి, నిమ్మల సాయి, గడ్డం వినయ్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఎండిన పంటలకు పరిహారం చెల్లించాలి

ఆదివాసీ నవ నిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహమూర్తి

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 20: పాలెం ప్రాజెక్టు కాల్వను నమ్ముకుని సాగు చేసిన వరి పంట ఎండిపో యిన రైతులకు పరిహారం అందించాలని ఆదివాసీ నవ నిర్మాణసేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్సా నర్సింహమూర్తి ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనతోపాటు సంఘం నాయకులు పాలెం ప్రాజెక్టు కింద ఎండిపోయిన పంట పొలాలను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా నర్సింహమూర్తి మాట్లాడుతూ పాలెం ప్రాజెక్టు కింద రైతులు వందలాది ఎకరాల్లో వరిపంట సాగుచేశారని అన్నారు. ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రాజెక్టులో నీరు వృథాగా పోయిందని అన్నారు. ప్రాజెక్టు కాల్వ నీరు అందకపో వడంతో చేతికొచ్చిన పంటలు ఎండిపో యాయన్నారు. వాటిని సర్వే చేసి రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇర్ప బాబు, అట్టం శివ, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నర్సరీని సందర్శించిన డీఆర్‌డీఏ పీడీ నరేష్

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 20: మండలంలోని మొట్లపల్లి గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న నర్సరీని శనివా రం భూపాలపల్లి జిల్లా గ్రామీ ణాభివృద్ధి అధికారి నరేష్ పరిశీలించారు. మొక్కలకు సరైన సమయంలో నీళ్లు అందించాలని, గడ్డి, చెత్తాచెదారం లేకుండా చూడాలని సూచించారు. ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు నీడ కోసం టెంట్లు, మంచినీరు తదితర సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఆయన వెంట స్వచ్ఛభారత్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటేష్, ఇన్‌చార్జి ఏపీఎం హలీం, టెక్నికల్ అసిస్టెంట్ రాము, పంచాయతీ కార్యదర్శి సుజాత, ఫీల్డ్ అసిస్టెంట్ సదానందం, తదితరులు పాల్గొన్నారు.

చల్వాయిలో అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్

గోవిందరావుపేట, ఏప్రిల్ 20: మండలంలోని చల్వాయి గ్రామంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ కార్యక్రమం శనివారం జరిగింది. ఈసందర్భంగా చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మేకల మహేందర్ రైతుల సమస్యలపై సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాచర్ల రాజ్‌కుమార్, పారా లీగల్ వలంటీర్ శేఖర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

చిట్యాల, ఏప్రిల్ 20: కాంగ్రెస్ బలోపేతానికి యూత్ కమిటీ నాయకులు కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండా శ్రీకాంత్, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి అన్నారు. స్థానిక క్యాంపు ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శులుగా గోపగాని కృష్ణ, గోల్కొండ నాగరాజు, లటికె రాజు, అల్లె నాగరాజు ఉపాధ్యక్షులుగా కంచర్ల రాంబాబు, గుంటుక కిషోర్, బొజ్జం వేణు, నాగరాజు, చంద్రకిరణ్, సహాయ కార్యదర్శులుగా కాంపెల్లి శ్రీకాంత్, మేకల శ్రీకాంత్, కార్యదర్శులుగా రంజిత్, మురహరి భానుచందర్, మొలుగూరి రమేష్, రమణకుమార్‌ను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో నాయకులు కిష్టయ్య, కొముర య్య, శీనివాస్, లక్ష్మణ్, కోఆప్షన్ మెంబర్ రాజ్‌మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి నేతల పరామర్శ

వెంకటాపూర్(రామప్ప), ఏప్రిల్ 20: మండలంలోని కేశవాపూర్‌లోని కాంగ్రెస్ నాయకుడు పచ్చిమట్ల రాంబాబు తండ్రి వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబాన్ని ఆ పార్టీ నాయకులు శనివారం పరా మర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్, బాదం ప్రవీణ్, కుక్కల నాగరాజు పాల్గొన్నారు.

కోదండ రామాలయానికి వితరణ

మంగపేట, ఏప్రిల్, 20: మండలం కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం దిన శ్రీ కోదండ రామాలయానికి అదే గ్రామానికి చెందిన దంతనపల్లి మల్లయ్య లక్ష్మీనర్సయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు, కోడళ్లు దంతెనెపల్లి లక్ష్మీనర్సయ్య, భద్రయ్య, ధనలక్ష్మి, వెంకటేశ్వర్లు, నవత రూ. 1,55,116 విలువ చేసే టెంట్, కుర్చీలు, వంటపాత్రలను వితరణ చేశారు. శనివారం ఈ కార్యక్రమం జరిగింది.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

గణపురం, ఏప్రిల్ 20: అగ్ని ప్రమాదాల నివారణపై కేటీపీపీ స్టేషన్ ఫైర్ అధికారి రాజా ఆధ్వర్యంలో శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్ని మాపక వారోత్సవాలలో భాగంగా కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టులో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సీఈ సిద్ధయ్య, ఇంజనీరింగ్ అధికారులు మురళీకృష్ణ, రఘుపతి, సెక్యూరిటీ అధికారి సురేష్ తదితరులు హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాల సందర్శన

చిట్యాల, ఏప్రిల్ 20: మండలంలోని చల్లగరిగ, జూకల్లు పాఠశాలల్లో జరుగుతున్న ఆరు నుంచి తొమ్మిదో తరగతి వార్షిక పరీక్షలను డీసీఈబీ కార్యదర్శి చంద్రశేఖర్ శనివారం పరిశీలించారు. ఆయన వెంట మండల నోడల్ అధికారి కృష్ణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

నిరంతరంగా పారిశుధ్య పనులు చేపట్టాలి

కలెక్టర్ భవేష్ మిశ్రా



మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 20: భూపాలపల్లి పట్టణంలో నిరంతరంగా పారిశుధ్య పనులు చేపట్టాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మునిసిపల్, సింగరేణి అధికారులతో ఆయన శనివారం సమావేశ మయ్యారు. భూపాలపల్లి మునిసిపల్ పరిధిలో పారిశుధ్య పనుల నిర్వహణపై సమీక్షించారు. సింగరేణి, మునిసిపల్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా జరగడంలేదని అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి



హారతి ఇస్తున్న అర్చకుడు

మంగపేట, ఏప్రిల్, 20: మండలంలోని మల్లూరు హేమాచలకొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో శనివారం సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ముందుగా చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించి జలాంజనేయస్వామి, పంచముఖాంజనేయస్వామిని, రమ సత్యనారాయణస్వామి, వేణుగోపాల స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపై కొలువైన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లను, లక్ష్మీనరసింహస్వామిని దర్శించు కున్నారు.

భూపాలపల్లికి రైల్వేలైన్ తెస్తా..

(5వ పేజీ తరువాయి)

ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని, మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బుర్ర వెంకటేశ్, మోరె రవీందర్‌రెడ్డి, గోపాల్, రఘు, నాగరాజు, శ్రీకాంత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి మారుపేరు కాంగ్రెస్

భూపాలపల్లి కలెక్టరేట్: అవినీతికి మారుపేరు కాంగ్రెస్ అని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గోరికొత్తపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసినందుకు ప్రజలు గోసపడుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ సర్కారు విఫలమైందని దుయ్యబట్టారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ. 2,500 ఇస్తామని అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి హామీ ఏమైందని ప్రశ్నించారు. అభివృద్ధి అనేది బీజేపీతోనే సాధ్యమన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశిధర్‌రెడ్డి, రాష్ట్ర అధికారప్రతినిధి కీర్తిరెడ్డి, రేగొండ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూములు లాక్కుంటే బతికేదెలా..?

నేషనల్ హైవే సర్వేను అడ్డుకున్న రైతులు



వ్యవసాయ భూముల వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 20: తమ జీవనాధారమైన భూములను జాతీయ రహదారి నిర్మాణం కోసం లాక్కుంటే బతికేదెలా..? అని అధికారులను రైతులు నిలదీశారు. మొగుళ్లపల్లి శివారులోని సర్వేనంబర్ 258, 259లో రెవెన్యూ అధికారులు భూసర్వే చేస్తున్న క్రమంలో విషయం తెలుసుకున్న రైతులు వ్యవసాయ భూముల వద్దకు పురుగుల మందు డబ్బాలతో చేరుకుని నిరసన తెలిపారు. వ్యవసాయ భూముల మీదుగా జాతీయ రహదారి నిర్మాణానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయగా మొగుళ్లపల్లిలో సుమారు 90మంది రైతులకు చెందిన 45ఎకరాలు జాతీయ రహదారి కింద పోనుంది. దీనిపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. భూ సర్వే చేస్తే ఆత్మహత్యలే శరణ్యమని అన్నారు. తమ జీవనాధారమైన భూములను జాతీయ రహదారి నిర్మాణానికి ఇచ్చే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. ఈ వ్యవసాయ భూముల్లో బావులు, బోర్లు, మోటార్లు, పైపులైన్ల ద్వారా పంటలను సాగు చేసుకుంటున్నామని, లక్షలాది రూపాయల విలువైన భూములను జాతీయ రహదారి నిర్మాణం కోసం ఇస్తే రోడ్లవెంట బిచ్చమెత్తుకుని తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పురుగులమందు తాగి ఈ భూముల వద్దనే ఆత్మహత్య చేసుకుంటామని అన్నారు. దీంతో భూసర్వేకు వచ్చిన రెవెన్యూ అధికారులు సర్వేను నిలిపివేసి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, సర్వేయర్ మంజుమాన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భయం.. భయం

(5వ పేజీ తరువాయి)

మంగపేట వద్ద 5.32 కిలోమీటర్లు, చుంచుపల్లి వద్ద 2.1, కత్తిగూడెం వద్ద 1.80, అకినేపల్లి మల్లారం వద్ద 1.7కిలోమీటర్ల పొడవునా కట్టను నిర్మించనున్నారు. పూర్తిగా రాతి తెట్టతో గోడను కట్టాలి. కాగా, ఏటూరునాగారానికి గోదావరి బ్యాక్ వాటర్‌తో ఏర్పడుతున్న ముప్పును అరికట్టేందుకు జంపన్నవాగుపై కూడా కరకట్ట నిర్మించేలా డిజైన్ రూపొందించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది.

పనులు మొదలవ్వవు.. పునరావాసం దక్కదు

కరకట్ట నిర్మాణానికి రెండేళ్లక్రితం కాంట్రాక్టు కంపెనీతో అగ్రిమెంట్ పూర్తయినా పనులు మొదలు కాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నదిలో ప్రవాహం తక్కువ ఉన్నప్పుడే నిర్మాణానికి అనుకూలం. శీతాకాలం, వేసవిలోనే వేగంగా పనులు జరగాల్సి ఉంది. కానీ, కాంట్రాక్టు కంపెనీ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో ముందుకు సాగడంలేదు. రామన్నగూడెం వద్ద ఏర్పడ్డ బుంగకు తాత్కాలిక మరమ్మతులు చేయడం వరకే పరిమితమయ్యారు. పలుచోట్ల చిన్నచిన్న రివిట్‌మెంట్, వట్టి పనులను సబ్ కాంట్రాక్టర్లతో చేయించి చేతులు దులపుకొన్నారు. రాష్ట్రమంత్రి సీతక్క ఆదేశాలతో ఇటీవల ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి నీటిపారుదల, రెవెన్యూ అధికారులతో కలిసి గోదావరి తీరాన్ని సందర్శించారు. కరకట్ట నిర్మించాల్సిన ప్రదేశాలను పరిశీలించారు. కాగా, 2022జూలైలో వరద ముంపుకు గురైన తీర గ్రామాలలో అప్పటి సీఎం కేసీఆర్ పర్యటించారు. పప్కాపురం గ్రామాభివృద్ధికి రూ.50లక్షల సాయం ప్రకటించడంతోపాటు ముంపు గ్రామాల ప్రజలకు ఎత్తైన ప్రదేశంలో పునరావాస కాలనీని నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే ఈ పప్కాపురం గ్రామం 1986వరదల అనంతరం ఏర్పాటైన పునరావాస కాలనీ కావడం గమనార్హం. రామన్నగూడానికి చెందిన ముంపు బాధితులైన ఎస్సీ, ఎస్టీలకు అప్పటి రాష్ట్రప్రభుత్వం ఐటీడీఏ ద్వారా ఇళ్లు కట్టించి ఇచ్చింది. మిగతా సామాజికవర్గాలవారు కూడా గ్రామం వదిలి వెళ్లేందుకు సిద్ధమైనా వారికి అవకాశం కల్పించకపో వడంతో అక్కడే ఉండిపోయారు. రామన్నగూడెం, ఏటూరునాగారం టౌన్ మినహా మిగతా ప్రాంతమంతా 1/70 చట్టం పరిధిలోకి వస్తుంది. అక్కడ ఏనిర్మాణం చేయాలన్నా అటవీశాఖ అనుమతులు తప్పనిసరి. ఈ క్రమంలో పునరావాసం ఎలా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ ప్రభుత్వమైనా స్పందించి కరకట్ట నిర్మాణ పనులు వేగవంతంగా జరిపించడంతోపాటు పునరావాస చర్యలను ముమ్మరం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బృహత్ శిలాయుగం నాటి మట్టికుండ పెంకులు లభ్యం



తవ్వకాల్లో బయటపడిన మట్టికుండ పెంకు

తాడ్వాయి, ఏప్రిల్ 20: మండలంలోని దామెరవాయి రాక్షసగుహల సమీపంలోని చెరువులో ఉపాధిహామీ పనుల నిమిత్తం కూలీలు శనివారం తవ్వకాలు జరుపుతుండగా బృహత్ శిలాయుగం నాటి మట్టికుండ పెంకులు లభ్యమైనట్లు దామెరవాయికి చెందిన ఔత్సాహిక గైడ్ కార్తీక్ తెలిపారు. దామెరవాయి రాక్షసగుహలను చూడడానికి పర్యాటకులు నిత్యం వస్తున్నారు. ఈ గుహలు పర్యాటకులను ఎంతగానో అబ్బురపరుస్తున్నాయి. బృహత్ శిలాయుగంలో ఆదిమానవులు నిర్మించిన సమాధులు ఈప్రాంతంలో ఉన్నాయి. ప్రస్తుతం సమాధుల సమీపంలోని చెరువులో తవ్వకాలు జరుపుతుండగా కుమ్మరిచక్రంపై చేసి కాల్చిన ఒక ఎరుపురంగు కుండ పెంకు బయటపడింది. దీనిని టార్చ్ టైం ఆఫ్ రీసెర్చ్ ఆన్ కల్చర్ సభ్యుడు కార్తీక్ ఆకుండను భద్రపరిచాడు. దీనిని చరిత్ర పరిశోధకులైన రామోజు హరగోపాల్, రత్నాకర్‌రెడ్డి, అరవింద్ ఆర్య, తదితరులకు తెలియజేయగా గమనించిన వారు కుండ పెంకుపై రెండు గీతల మధ్య గోటినొక్కు వంటి డిజైన్ ఉందని, దీనిపై ఒక వృత్తంపై మరో వృత్తం గీసి ఉండడంతో అప్పటి కుమ్మరుల పని తనానికి నిదర్శనమని వారు వివరించారు. గతంలో ఆదిమానవులు వ్యవసాయంపై ఆధారపడి జీవించేవారని, ధాన్యాన్ని నిల్వ చేసేందుకు కాగుపెద్ద (బానలాంటి) కుండ వాడేవారని అన్నారు. అప్పటి మానవులు ఇంజనీరింగ్ నైపుణ్యం, వృత్తి నైపుణ్యాలను కలిగి ఉన్నారని అర్థమవుతోంది. ఇప్పటికైనా దామెరవాయి ప్రాంతంలో పురావస్తు శాఖ అధికారులు మరికొన్ని తవ్వకాలు జరిపి పురావస్తు విశేషాలను బయటకు తీయాల్సి ఉంది. అయితే ఈప్రాంతాన్ని పర్యాటకంగా గుర్తించాలని దామెరవాయి ప్రజలు కోరుతున్నారు. ఈప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.